## రూ.106 కోట్లతో రహదారుల అభివృద్ధి



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, మార్చి 12: తాండూరు రోడ్లకు మహర్దశ ప్రారంభమైందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని యాలాల మండలం లక్ష్మినారాయణపూర్ చౌరాస్తా నుంచి బషీరాబాద్ వరకు రూ.68 కోట్లతో, బషీరాబాద్ నుంచి మైల్వార్ వరకు రూ.38 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపాదికన తాండూరు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు, అందుకు ప్రత్యేక నిధులు తీసుకు వస్తున్నట్లు పేర్కొన్నారు.

**బంట్వారం/కోట్‌పల్లి:** కోట్‌పల్లి మండల పరిధిలోని ఇందోల్, ఓగ్లాపూర్, లింగంపల్లి, అన్నసాగర్ తదితర గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్మించిన సీసీ రోడ్లను, సైడ్ డ్రైన్‌లను బుధవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మండల స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు..



నవాబుపేట, మార్చి12: ఎస్సీ వర్గీకరణ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు సరైంది కాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు గుట్టకింది రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఎంఆర్‌పీఎస్ నేతల దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రవికుమార్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కాకముందే గ్రూప్స్ ఫలితాలను విడుదల చేయడం సరైన పద్ధతి కాదన్నారు. 59 ఉప కులాల భవిష్యత్తును కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగ్గిన గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. మాదిగల సహనాన్ని పరీక్ష చేయడం అంటే అగ్గితో పెట్టుకున్నట్లేనన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి చిట్టి గిద్ద కిష్టయ్య, మండల సీనియర్ నాయకులు దేవయ్య, చంద్రయ్య, జాన్, పరమానందం, రాంచంద్రయ్య, బద్రి, చంద్రం, దశరథ్, వేంటకేశ్, శంకర్, సుదర్శన్, ఈశ్వర్, దాన అంజయ్య పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



యాలాల, మార్చి12: యాలాల మండలం కోకట్ గ్రామ పరిధిలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (జేసీ) బాలికల వసతి గృహాన్ని బుధవారం ఎంపీడీఓ పుష్పలీల, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌తో కలిసి తనిఖీ చేశారు. కిచెన్, మధ్యాహ్న భోజనం నాణ్యత, సామగ్రి నిల్వలను పరిశీలించారు. తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులను మాత్రమే వంటకు వినియోగించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ తప్పనిసరిగా అమలు చేయడంతో పాటు శుద్ధమైన తాగునీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



తాండూరు రూరల్, మార్చి 12 : గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని చెనేష్‌పూర్ గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులతోపాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ తదితరులు ఉన్నారు.

## పీఏసీఎస్ పాలక మండలికి సన్మానం



బంట్వారం, మార్చి12 : బంట్వారం పీఏసీఎస్ పాలక మండలి సభ్యులను స్థానిక కార్యాలయ సిబ్బంది బుధవారం సన్మానించారు. ఫిబ్రవరి నాటికి పాలక మండలి పదవీ కాలం ముగియగా, ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పదవీ కాలాన్ని పొడగించడంతో సంఘం సమావేశం నిర్వహించారు. ఇదే సందర్భంగా చైర్మన్ రాంచంద్రారెడ్డి తోపాటు ఇతర సభ్యులందని సీఈవో బ్రహ్మం, ఇతర సిబ్బంది వారిని శాలువలతో సన్మానించారు.

## ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

నవాబుపేట, మార్చి12: ఆర్థిక ఇబ్బందులు భరించలేక మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని నారేగూడం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పోచనోళ్ల పావని (25) భర్త రమేశ్ ఇద్దరు పిల్లలు కలిసి నారేగూడ గ్రామంలో జీవనం సాగిస్తుంది. బుధవారం పావని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందనే సమాచారం రావడంతో ఎస్ఐ అరుణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి తండ్రి బుర్ర బీమయ్య, తమ కూతురు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు.

# ఆర్థిక లావాదేవీలపై అవగాహన

దోమ, మార్చి 12: బ్యాంకులు సూచించిన డిజిటల్ యాప్‌ల ద్వారానే ఆర్థిక లావాదేవీలు కొనసాగించాలని రిజర్వ్ బ్యాంకు అధికారులు రెహమన్, సావిత్రి సూచించారు. డిజిటల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం దోమ మండల పరిధిలోని దొంగ ఎన్కెపల్లి గ్రామంలో డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై బ్యాంకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులు సూచించిన సురక్షితమైన యాప్‌లను ఉపయోగించాలన్నారు. ఎట్టి పరిస్థితిలో థర్డ్ పార్టీ యాప్‌ల జోలికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. నగదు రహిత లావాదేవీలు చేసే క్రమంలో సైబర్ మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు వారు వివరించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల అధికారులు డిజిటల్ లావాదేవీలపై ప్రచారం చేసి అవగహన కల్పించాలని ఆర్బీఐ అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎస్బీఎం విజయేందర్,ఎఫ్‌వో నాగేష్ ఇతర అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

**దొంగ ఎన్కెపల్లిలో ఆర్బీఐ సదస్సు**



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రిజర్వ్ బ్యాంకు అధికారులు

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తాండూరు మండలం ఖంజాపూర్‌లో ...



ధారూరు మండలం మోమిన్‌ఖుర్ధు గ్రామంలో..

తాండూరు రూరల్, మార్చి 12: తాండూరు మండలం, ఖంజాపూర్‌లో రూ. ఎనిమిది లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీ రోడ్డు పనులు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో మిగిలిన కాలనీల్లో కూడా రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తామన్నారు.

**ధారూరు:** ధారూరు మండల పరిధిలోని మోమిన్‌ఖుర్ధు గ్రామంలో ఎంపీ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, పాండుగౌడ్, వివేకానందా రెడ్డి, రాజేందర్‌గౌడ్, రమేశ్, రాజేందర్ రెడ్డి, శ్రీకాంత్, మల్లేశం, అర్జున్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

# జైలుకు వెళ్లొచ్చినా బుద్ధి మారలేదు




చోరీ చేసిన సొత్తును చూపెడుతున్న డీసీపీ బాలస్వామి, ఇతర పోలీసు అధికారులు

- సెంచరీ చోరీల శంకర్ నాయక్ అరెస్ట్
- పీడీ యాక్టు నమోదైనా మారని వైనం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12: చెడు వ్యసనాలకు అలవాటు పడి వందకు పైగా దొంగతనాలకు పాల్పడిన శంకర్ నాయక్ (32) అనే కరడుగట్టిన దొంగను ఓయూ పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చిన 15 రోజుల్లో నాలుగు చోరీలు చేసి తన ప్రతిభ చాటుకున్నాడు. గతంలో పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినా తన తీరు మార్చుకోలేదు. ఓయూ ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ నరసయ్య, సీఐ రాజేందర్‌తో కలిసి డీసీపీ డాక్టర్ బాలస్వామి వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా వీపనగండ్ల మండలం తుమ్మకుంట గ్రామం నాగర్లబండ తండాకు చెందిన రత్లావత్ శంకర్ నాయక్ గద్వాల్లో బీఫార్మసీ చదువుతుండగా.. ఓ హత్యాయత్నం కేసులో 2012లో జైలుకు వెళ్లివచ్చాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడి, రాత్రుళ్లు బయట తిరిగేవాడు. అతడి జల్సాలకు తన సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో రాజేశ్ రెడ్డి, రంగారావు, లియాజాఖాన్ తదితర పేర్లతో చలామణి అయ్యాడు. కాలనీలు, వివిధ ప్రాంతాల్లో పగలు తాళం వేసి ఉన్న ఇండ్లను గమనించి, రాత్రి సమయాల్లో ఐరన్ రాడ్ సాయంతో చాకచక్యంగా తలుపు తెరిచి దొంగతనానికి పాల్పడేవాడు. 2022 సెప్టెంబర్‌లో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడి, పోలీసులకు చిక్కడంతో పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపారు. బయటకు వచ్చినా తిరిగి దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కడంతో మళ్లీ జైలు పాలయ్యాడు. అలా పలుమార్లు జైలుకు వెళుతూ దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో గత నెలలో జైలు నుంచి విడుదలైన శంకర్ నాయక్ తన వైఖరిని మార్చుకోక 15 రోజుల వ్యవధిలో నాలుగు దొంగతనాలు చేశాడు. వాటిలో ఒకటి ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో కాగా, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చొప్పున ఉండటం గమనార్హం. ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో నివాసముండే రాంజీ తన కుటుంబంతో సహా ఈనెల 1న మేడ్చల్‌లోని బంధువుల నివాసానికి వెళ్లి, 2న తిరిగివచ్చే సమయానికి ఇళ్లు తాళం తీసి ఉండటంతో పాటు సామన్లన్నీ చిందరవందరగా పడి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు చోరీ జరిగిన విధానం, ఫింగర్ ప్రింట్లు సేకరించి శంకర్ నాయక్ నేరం చేశారని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో నిందితుడు బుధవారం ఉదయం ఎల్బీనగర్‌లో సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ తరలించి, విచారించగా తన నేరాలను ఒప్పుకున్నాడు. శంకర్ నాయక్ చోరీ విధానం చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు. తాను చోరీ చేసిన ప్రదేశంలో అక్కడ దొంగతనం చేసిన వస్తువుల వివరాలను ఒక చీటీలో రాసి అక్కడ వదిలేవాడు. చీటీ దొరకని పక్షంలో గోడపై వివరాలను రాసేవాడు. అంతేకాకుండా, అన్ని చోరీల వివరాలు, అక్కడ చోరీ చేసిన వస్తువుల వివరాలను డైరీలో ఎప్పటికప్పుడు పొందుపర్చడం గమనార్హం. గతంలో ఒక చోరీ చేసిన సమయంలో అక్కడ ఏమీ లభించకపోయినా ఐదు తులాల బంగారు ఆభరణాలు పోయాయని ఇంటి యజమాని ఫిర్యాదు చేయడం, పోలీసులు తన నుంచి రికవరీ చేయడంతో అప్పటి నుంచి ఈ అలవాటు చేసుకున్నానని శంకర్ నాయక్ చెప్పడం విశేషం. అతడి నుంచి 11 తులాల బంగారు ఆభరణాలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపర్చనున్నట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకున్న డీఎస్సై శ్రీనివాసరావు, ఎస్సై యాసిన్ షరీఫ్, ఏఎస్సై ఈశ్వర్, ఇతర పోలీసులకు డీసీపీ అభినందించి రివార్డు అందజేశారు.

## చదివేది ఇంజినీరింగ్.. చేసేది గంజాయి వ్యాపారం

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): తాజెడ్డ కోతి వనమంతా చెర్చింది అన్న చందంగా తాను మత్తుకు అలవాటు పడింది కాకుండా తోటి విద్యార్థులకు కూడా గంజాయి విక్రయిస్తున్న ఒక ఇంజినీరింగ్ విద్యార్థిని ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 1.368 కేజీల గంజాయితోపాటు బైక్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం... కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘట్‌కేసర్‌లోని ఓ ఇంజినీరింగ్ కాలేజిలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే చెడు వ్యసనాలకు అలవాటు పడిన రాజు గంజాయికి బానిసగా మారి, డబ్బు కోసం దానినే వృత్తిగా మార్చుకున్నాడు. ఏకంగా తాను చదువుతున్న కళాశాలలోనే తోటి విద్యార్థులకు గంజాయి విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు బుధవారం బీదర్ నుంచి గంజాయి తీసుకువచ్చి కళాశాలలో విక్రయిస్తున్న రాజును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఘట్‌కేసర్ ఆబ్కారీ పోలీసులకు అప్పగించారు. ఈ కేసును ఛేదించిన వారిలో సీఐ భిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు, కానిస్టేబుళ్లు యాదగిరి, అనిఫ్, నితిన్, శ్రీనివాసరెడ్డి, శంకర్, అరుణ్ ఉన్నారు.



నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు

## డ్రగ్స్ విక్రేత అరెస్టు

సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): బెంగళూరు కేంద్రంగా నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 6.7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ సీఐ నాగరాజు కథనం ప్రకారం... నగరానికి చెందిన కర్లపూడి సుజిత్ బెంగళూరులో చదువుకుంటూ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. చదువు పూర్తైన తరువాత హైదరాబాద్ వచ్చిన సుజిత్ డీజే నేర్చుకున్నాడు. ఆ సమయంలో కూడా బెంగళూరులో ఉన్న పరిచయాలతో తరచూ అక్కడికి వెళ్లి డ్రగ్స్‌ను గ్రాముకు రూ.2వేల చొప్పు న కొనుగోలు చేసి, అనంతరం నగరంలో గ్రాము రూ.5వేలు చొప్పున విక్రయిస్తున్నాడు. హోళీ పండుగకు డ్రగ్స్‌ను నగరానికి తీసుకువచ్చి విక్రయించాడు. అందులో కొంత తన కోసం ఇంట్లో నిలువ చేసుకున్నాడు. ఎస్‌టీఎఫ్ పోలీసులు బుధవారం సుజిత్ ఇంటిపై దాడి చేసి అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 6.7గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. .

## ర్యాష్ డ్రైవింగ్.. ప్రశ్నించిన వ్యక్తిపై దాడి

బంజారాహిల్స్,మార్చి 12: ర్యాష్ డ్రైవింగ్ ఎందుకు చేస్తున్నావని ప్రశ్నించిన ఓ వ్యక్తిని చితకబాదిన ఇద్దరు యువకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్న షేక్ తబ్రేజ్(29) అనే యువకుడు ఈనెల 6న సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. జూబ్లీహిల్స్ రోడ్ నం.5లోకి రాగానే వెనుక నుంచి వచ్చిన బైక్ అకస్మాత్తుగా ర్యాష్ డ్రైవింగ్‌తో దూసుకువచ్చింది. దీంతో స్లోగా వెళ్లవచ్చు కదా.. అంటూ తబ్రేజ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో బైక్ మీద నుంచి దిగిన ఆ ఇద్దరు యువకులు అతడిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు తనపై దాడి చేశారని, వారి దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందానని బుధవారం బాధితుడు తబ్రేజ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బీఎన్ఎస్ 126(2), 115(2), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అక్రమంగా విద్యుత్ వాడితే చర్యలు



ఇటుక బట్టీలలో విద్యుత్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కులకచర్ల, మార్చి 12 : ఇటుకబట్టీలకు అక్రమంగా విద్యుత్‌ను వాడితే చర్యలు తప్పవని మండల విద్యుత్ శాఖ అధికారి హైమద్ హెచ్చరించాడు. బుధవారం మండల కేంద్రంలోని వివిధ గ్రామాల దగ్గర ఇటుకబట్టీలకు అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన తన సిబ్బంది ద్వారా విద్యుత్ వైర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుకబట్టీలకు అనుమతి లేకుండా విద్యుత్‌ను వాడుకుంటున్నారని, అక్రమంగా విద్యుత్‌ను వాడటం నేరమన్నారు. గతంలో కూడా ఇదే విధంగా విద్యుత్‌ను అనుమతి లేకుండా వాడితే విద్యుత్ వైర్లను తొలగించినట్లు తెలిపారు. ఇటుకబట్టీల యజమాలను విద్యుత్ శాఖ నుంచి అనుమతి పత్రాలను పొందిన తరువాతనే విద్యుత్‌ను వాడుకోవాల్సి ఉంటుందని, దీనికి విరుద్ధంగా మండలంలోని ఇటుకబట్టీల యజమానులు వ్యవహరిస్తున్నారని, అలా చేయడం తగదన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, లైన్‌మెన్ కుర్మారెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ రాములు, ఆర్టిజన్ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



కులకచర్ల, మార్చి 12 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆహారపదార్థాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ఆహారాన్ని సమయానుకూలంగా అందించాలని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదువుకుంటారన్నారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత గురించి విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో దేవి ఉన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీఆర్పీలకు సన్మానం



కులకచర్ల, మార్చి 12 : 2008లో డీఎస్సీలో ఎంపికైన సీఆర్పీలకు కులకచర్ల రైతు వేదికలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. సమగ్ర శిక్షణోద్యోగుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కులకచర్ల ఎంఈవో అబీబ్‌హైమద్ మాట్లాడుతూ సర్వశిక్షలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీఆర్పీలు కులకచర్ల మండలం కృష్ణయ్య, పరిగి మండలం విద్యాసాగర్, దోమ మండలం సతీశ్‌కుమార్ 2008డీఎస్సీలో ఉద్యోగానికి ఎంపికయ్యారన్నారు. వీరు విద్యావృత్తిలో సీఆర్పీలుగా ఉత్తమ ప్రతిభను కనబర్చారని, ఉపాధ్యాయులుగా కూడా మంచి ప్రతిభను చూయిస్తారని అన్నారు. విద్యాభివృద్ధిలో వీరిపాత్ర అభినందనీయంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ ఎంఈవో రాంచందర్, వివిద పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



ధారూరు, మార్చి 12: మండల పరిధిలోని మైలారం ముందలి తండా విస్లావత్ శ్రీనివాస్ నూతనంగా తెచ్చిన పంటలకు మందు పిచికారీ చేసే (డ్రోన్)యాంత్రాన్ని బుధవారం మండల పార్టీ నాయకులు పూజ చేసి ప్రారంభించారు. ఈ యంత్రంతో మందును పంటలకు పిచికారీ చేయడంతో త్వరగా పూర్తి చేయవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, దేవేందర్ నాయక్, శ్రీనివాస్, వెంకటేశం, రాజునాయక్, శశాంక్, వంశీగౌడ్, కార్యకర్తలు ఉన్నారు.

## బ్యాంక్ క్యాషియర్ చేతివాటం

### జమ చేయమంటే.. జేబులో వేసుకున్నాడు

వెంగళరావునగర్, మార్చి 12: కంచే చేను మేసిన చందంగా ఉన్నది బ్యాంక్ అధికారి తీరు. ఖాతాలో డబ్బు జమ చేయాలని డబ్బిస్తే.. జేబులో వేసుకుని చేతివాటం ప్రదర్శించాడు బ్యాంక్ క్యాషియర్. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం..అమీర్‌పేట్‌లోని సౌత్ ఇండియా బ్యాంక్ లిమిటెడ్‌లో డబ్బు జమ చేసేందుకు ఖాతాదారుడు వల్లభనేని హరీశ్‌బాబు రూ.50 వేలు డబ్బుతోపాటు పే స్లిప్ ఇచ్చారు. తన అకౌంట్‌కు రూ.25,000 తన అకౌంట్‌కు రూ.25,000 జమ చేయాలని క్యాషియర్‌కు ఇచ్చాడు.అందులో రూ.25వేలు మాత్రమే అకౌంట్‌లో జమ చేసి సగం డబ్బు రూ.25వేలను క్యాషియర్ ఆదర్శ పరిహార్ తన జేబులో వేసుకున్నాడు. తన అకౌంట్‌లో డబ్బు జమ కాకపోవడంతో ఖాతాదారుడు హరీశ్ బ్యాంక్ మేనేజర్ మితున్ పచేరి మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అంతర్గత విచారణ చేపట్టారు. బ్యాంకు సీసీటీవీ కెమెరాల్లో క్యాషియర్ డబ్బు జేబులో వేసుకున్నట్లు ఆధారాలు దొరికాయి. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్యాషియర్ రూ.25వేలు కాజేసి తన జేబులో వేసుకోవడం సీసీ కెమెరాల్లో రికార్డ్ ఉందని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

బండ్లగూడ, మార్చి 12. ఉత్తరప్రదేశ్ మదురై నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన ప్రకారం... ఉత్తరప్రదేశ్ మదురై నుంచి దేవి చరణ్(42)హైదరాబాదులోని తన స్నేహితుడైన దేవేందర్ కుమార్ వద్దకు బతుకుదెరువు కోసం వచ్చాడు. కాగా, దేవేందర్ ఉద్యోగం దొరికేంత వరకు తన వద్ద ఉన్న చెరుకు రసం బండి వద్ద పని చేసుకోవాలని సూచించాడు. ఈ నేపథ్యంలో దేవిచరణ్ అక్కడ పని చేస్తూ అతడితోనే ఉంటున్నాడు. ఇదిలా ఉంటే దేవి చరణ్ సోమవారం అర్ధరాత్రి చెరుకు బండి మూసేసి ఇంటికి వెళ్లకుండా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రహదారిపై నిద్రించారు. కర్ణాటక చెందిన ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడిపి అతడి మీదుగా పోనిచ్చాడు. దీంతో దేవిచరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దేవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేపడుతున్నారు.